# చిగురు

పోస్ట్‌మన్ ఉత్తరం ఇచ్చివెళ్ళాడు. దస్తూరీ చూడగానే గ్రహించాను, రామ్మూర్తి వ్రాశాడు. చదవగానే సంతోషం గలిగింది. అతను నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్నాడు. అసిస్టెంట్ ఇంజనీరుగా ప్రమోషన్ వచ్చిందట. త్వరలో ఓసారి సాగర్ రమ్మని వ్రాశాడు.

రామ్మూర్తీ నేనూ బాల్యస్నేహితులం స్కూల్‌ఫైనల్‌దాకా కలిసి చదువుకున్నాం. తరువాత ఇంటర్‌లో అతను సైన్సెస్, నేను ఆర్ట్సు తీసుకోటంవల్ల కొంత వేరుపడిపోయాం. ఇంటర్ తర్వాత అతను ఇంజనీరింగ్ కోర్సుకి వెళ్ళాడు. నేను బి. ఏ. పూర్తిచేసి లా కోర్సులో చేరాను. అయినా ఇద్దరమూ ఒకఊరివాళ్ళం కావటంవల్ల మాకు దోస్తీ ఎక్కువగా ఉండేది.

రామ్మూర్తి ఉత్తరం నాలో పాత జ్ఞాపకాలని రేపింది. స్కూల్‌ఫైనల్ క్లాసులో నేనూ, రామ్మూర్తీ, కోటేశ్వరరావు, వేణు, విశ్వం ఒకే బెంచీ మీద కూర్చునేవాళ్ళం. నాపక్కని రామ్మూర్తీ, తర్వాత వేణు, చివర కోటేశ్వర్రావు, కూర్చోటం అలవాటు. స్కూల్‌ఫైనల్ కాగానే వేణు నాన్నగారికీ, విశ్వంనాన్నగారికీ ట్రాన్స్‌ఫర్ కావటంవల్ల వాళ్ళు ఏం చదివిందీ ఎక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ తెలియదు. కోటేశ్వర్రావు మొదటి మూడునెలల పరీక్షకాగానే స్కూల్ మానేశాడు. అతన్ని తలుచుకుంటే ఒకసారి వళ్ళుమండుతుంది, మరోసారి జాలి కలుగుతుంది. మొదట్లో నేనూ, రామ్మూర్తి కోటేశ్వర్రావుని చూసి ఈర్ష్య చెందేవాళ్ళం. అతను

చీట్లపేక బాగా ఆడతాడు, మాకురాదు. చెడుగుడులోకూడా అతను మొన గాడే, బాగా పాడగలడుకూడా. అన్నిటికి మించి అతను క్లాసులో హీరో, టీచర్లకి అతనంటే హడల్. నిజానికి మా అందరికీ కూడా అతనంటే కొంచెం భయమే. కొట్టిమాట్లాడేరకం, మాటలో కరుకుతనం జాస్తి. అయితే అలాంటి మనిషితో పరిచయం ఉండటం మేమందరమూ గర్వ కారణంగానే భావించేవాళ్ళం. అతను మాతో మాట్లాడటమే మాకు గొప్పగాఉండేది. అతని ఆసరా చూసుకుని అవసరమైనప్పుడు ఇతరులతో మేము కీచులాట పెట్టుకుంటూ ఉండేవాళ్లం. అదివాళ్ళకి కంటకంగా ఉండేది. కాని ఇదంతా మూణ్నాళ్ళముచ్చటై పోయింది.

కోటేశ్వర్రావు నాన్న అప్పుడప్పుడు స్కూలుకివచ్చి టీచర్లని కలుసుకుని "మాపిల్లగాణ్ని కాస్తంత కనిపెట్టండిబాబూ" అని దణ్ణాలుపెట్టి పోతూ ఉండేవాడు. "మీ వాడికేం ఫర్వాలేదులే రంగయ్యా వాడు నీలా పాలు పోసుకొని బతికేరకం కాదులే." అని టీచర్లు భరోస ఇస్తూండేవాళ్ళు. ఆ మాటల్లో ఏమైనా వ్యంగ్యం ఉన్న దేమోనని ఇప్పుడాలోచిస్తే అనిపిస్తు న్నది. పాపం, రంగయ్య తృప్తిపడి వెళ్ళిపోయేవాడు.

పాలుపోసినా, నీళ్ళుపోసినా రంగయ్యని ఊళ్లో అందరూ పాలరంగయ్య అనే అనేవాళ్ళు. అతనంటే అందరికీ సదభిప్రాయం ఉండేది.. ఎండ నక వాననక ఒళ్ళు వంచి పనిచేసేరకం. పొద్దున స్కూల్‌కి వెళ్ళేటప్పుడు గేదెల్ని పొలాలకి తోలుకు వెళుతూ నాకు ఎదురై పలకరించేవాడు.

"మా కోటయ్య బాగా చదువుతాడా బాబూ?" అని ఎంతో ఆశతో అడిగే వాడు. ఆముఖంలోని ఆశ, ఆకాంక్ష నాకిప్పటికీ మరుపురాదు.

"మీవాడు క్లాసు ఎగ్గొడతాడు, చీట్లాడతాడు, బీడీలు తాగుతాడు, పాఠాలు చదవడు, టీచర్లు వాడి సంగతి పట్టించుకోరు," అని చెబితే ఆ బక్క పలచటి పొడుగాటి మనిషి నిలువునా కూలిపోడనే భయంతో "వాడికేం

రంగయ్యా" అనేవాడిని. రంగయ్య సంబరపడి "ఏదో, దేముడి చలవ. ఆడు వెద్దోడై పెద్దుద్యోగం చేస్తుంటే నాకేంగావాలః" అని ముందుకి సాగిపోయేవాడు,

రంగయ్యకి కొంచెం లౌక్యం తెలియకపోలేదు. కోటేశ్వరరావు టీచర్లెవరెవరో తెలుసుకొని వాళ్ళందరికీ అడపాదడపా తృణమోపణమో ముట్టచెప్పుతుండేవాడు. పండగలకీ పబ్బాలకీ పాలూ, పెరుగూ సప్లయి చేయటమేకాక, గేదె ఈనిందని జున్నుపాలూ, పెరట్లో కాశాయని కూరగాయలూ అందజేసి కొడుకు పరీక్షలు తప్పకుండా యధాశక్తిని పాటుపడుతుండేవాడు. లేకపోతే కోటేశ్వరరావు స్కూలుఫైనలు వరకూ వచ్చే ప్రశ్నేలేదు.

ఓ రోజు కోటేశ్వరరావు తెలుగు మాస్టారు క్లాసులో రభసచేసి రామ్మూర్తి మీదకి నెట్టాడు. తెలుగుమాస్టారు ఉగ్రుడై రామమూర్తిని చితకకొట్టేశాడు. రామ్మూర్తి కోటేశ్వరరావుని ఏమిచేయలేక ఉక్రోషంతో రంగయ్య దగ్గరికి వెళ్ళి అతని సంగతంతా చెప్పేశాడు. మర్నాడు రంగయ్య స్కూల్‌కి వచ్చి లబోదిబో మన్నాడు. సమయానికి కోటేశ్వరరావు క్లాసులో లేడు,

"నానాగడ్డి కఱిచి కూడబెడుతున్నా బాబూ, ఆడికి బాగా చదువు చెప్పించాలి, ఆడు పెద్ద ఆఫీసరు కావాలని ఎంకటేశ్వరునికి రేయింబగల్లు మొక్కుతున్నా బాబూ, తమరే దయుంచాల."

వంటిమీద చొక్కా లేకుండా, బుజాన వేసుకున్న పాత తుండుగుడ్డతో, పొగచూరినట్టున్న ముఖంమీద కారే చెమట తుడుచుకుంటూ, ఎగగట్టిన ముతక పంచెతో నిలబడి క్లాసు టీచరుకి దణ్ణాలు పెడుతున్న రంగయ్యని చూస్తుంటే నాకు కోటేశ్వరరావుమీద అమిత కోపం వచ్చింది.

"ఏం చేస్తాం రంగయ్యా, అదృష్టం అందలమెక్కిస్తే, బుద్ధి బురదలోకి లాగుతోంది। ఇంటిదగ్గర కాస్త భయపెట్టు, తర్వాత చూద్దాం." క్లాసు టీచర్ అనునయంగా అన్నారు.

"చిత్తం తమరు కనిపెట్టుండాల డాబూ." అని నీరసంగా వెళ్ళిపోయాడు రంగయ్య.

ఆ రాత్రి రంగయ్య కొడుకుని చావకొట్టాడట. వాడు అలిగి రాత్రికిరాత్రే ఇల్లు విడిచి ఎటో వెళ్ళిపోయాడు. తర్వాత రంగయ్య పిచ్చిపట్టినట్టు ఊరంతా తిరిగాడు. పేపర్లో వేయించాడు. పోలీసు రిపోర్టు ఇప్పించాడు. జాడలేదు. అతనికి మనోవ్యాధి పట్టుకుంది. రోజూ తెల్లవారుజామునే పాలచెంబుతో ప్రత్యక్షమయ్యే రంగయ్య ఓ తెల్లవారుజామున పాలచెంబు వదిలేసి వెళ్ళిపోయాడు.

రంగయ్య పోయిన పదకొండోరోజున ఎక్కడనించో ఊడిపడి కర్మ చేశాడు కోటేశ్వరరావు. పిత్రార్జితం మూడెకరాలతో పైలాపచ్చీసుగా జీవితం గడపసాగాడు. స్కూల్ ఫైనల్ చదువుకున్నాడనుకుని ఎవరో చక్కటి పిల్లనిచ్చి పెళ్ళిచేశారు. ప్రొద్దున నిద్రలేవటం, హోటల్‌కివెళ్ళి తినగలిగినంత తిని కాఫీ త్రాగి, రామాలయం అరుగుమీదికిచేరి స్నేహితులతో చీట్లాడి, ఎప్పుడో నాలుగుమెతుకులు నంజి, మళ్ళీకాసేపు జూదమాడి, ఏ సినిమాకో వెళ్ళి తప్పతాగి, ఎప్పుడో కొంపకిచేరి తెల్లారేదాకా గురకపెట్టి నిద్రపోటం అతని దినచర్య. ఎకరం తర్వాత ఎకరం ఐపోయింది. పాలవ్యాపారంతో భార్య గడించే నాలుగు డబ్బులతో సంసారం గడపాలిసిన స్థితి ఏర్పడ్డది. రానురాను సంసారం భారమైంది. కుడవ కూడూ, నిలవనీడా లేకుండా పోయింది. పిల్లలు అలోలక్ష్మణా అని ఈసురో మంటూంటే గతిలేక ఓరోజు కుటుంబంతో జీవయాత్రగడపటం కోసం సాగర్ వెళ్ళిపోయాడు కోటేశ్వరరావు.

నాకూ రామ్మూర్తికీ కోటేశ్వరరావుతో గల పరిచయం స్కూలుఫైనల్‌లో మేము కలిసి చదివిన మూడునెలలవరకే పరిమితమైనప్పటికీ, అతనిదుస్థితి నాకెంతో విచారం కలిగించింది. రామ్మూర్తికి సాగర్లో కోటేశ్వరరావు కనిపించాడేమో తెలియదు. నేను ఊళ్ళో ఉన్నవాడిని కనుక కోటేశ్వర రావుని గుర్తుపెట్టుకున్నాను. బహుశా రామ్మూర్తి అతని సంగతే మర్చి పోయి ఉంటాడు. ఎప్పటిసంగతి! పుష్కరం దాటిపోయింది.

రామ్మూర్తి ఆహ్వానాన్ని పురస్కరించుకుని ఒకరోజు సాగర్ వెళ్ళాను. ముందే ఉత్తరం వ్రాయటంవల్ల బస్‌స్టాండ్‌కివచ్చి జీపులో ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఇల్లంతా కలయచూడసాగాను.

"ఏమిటి చూస్తున్నావు? ప్రస్తుతం ఫామిలీ లేదులే."

ఏవో పిచ్చాపాటీ మాట్లాడుతూ గతంలోకి ప్రయాణించాం. తర్వాత అతని ఉద్యోగం సంగతులు మాట్లాడుకొన్నాం. అతను ఆకస్మాత్తుగా ఏదో జ్ఞప్తికి తెచ్చుకొని "రాస్కెల్, ఇందాకనంగా పంపాను. ఇంకా రాలేదు. ఏం గాడిదలుకాస్తున్నాడో. లేజీఫెలో" అన్నాడు.

"ఎవరు?" అన్నాను అప్రయత్నంగా.

"వాడే, కోటాయ్. మా నౌకర్లే, వచ్చేశాడులే. థాంక్‌గాడ్," అని నిట్టూర్చాడు రామమూర్తి.

ఆ కోటాయ్ అన్నవ్యక్తి టేబుల్‌మీద ఫ్లాస్క్ పెట్టి కొంచెం వెనక్కి జరిగి నిలబడ్డాడు. కాకీ పాంటూ, కాకీచొక్కా, తలగుడ్డా అతను నౌకరని చెప్పక చెబుతున్నాయి,

"కప్పుల్లో పొయ్యి. అదికూడా చెప్పాలా?" అని కసురుకున్నాడు రామ్మూర్తి. వెంటనే అతడు కప్పులు తెచ్చి కాఫీ పోయసాగాడు. అతని ముఖం వైపు చూశాను. ఎక్కడో చూచినట్టు అనుమానం కలిగింది.

కాఫీ కప్పు నా కందిస్తూ అతను నా ముఖంలోకి చూసి చప్పున ముఖం దించుకున్నాడు.

"నిన్నెక్కడో చూసినట్టుందోయ్, మీదేఁ రేది ?" సందేహ నివృత్తికోసం అడిగాను.

"గుంటూరండి."

"ఎక్కడుండేవాడివి ?"

"కొత్తపేటండి."

"మీ నాన్న పేరు."

"రంగయ్యండి," నమ్రతతో జవాబిచ్చాడతను.

అదిరిపోయి అతనిముఖంలోకి చూశాను, అతను కోటేశ్వరరావా ! కళ్ళు గుంటలు పడి బుగ్గలు లోతుకుపోయి, నల్లకప్పు వేసుకున్న ఆ ముఖం ! నమ్మలేకపోయ్యాను.

" ఏ రంగయ్య ?"

"కోటాయ్. చిల్లర తెచ్చావా ?" అని మాటల కడ్డొచ్చి రామ్మూర్తి అడిగాడు.

"తెచ్చాను సార్ !"

అతను జేబులోంచి ఒక అయిదురూపాయలనోటు, నాలుగు రూపాయల నోట్లు, కొంత చిల్లర తన బల్లమీద పెట్టాడు. రామ్మూర్తి అయిదు రూపాయల నోటు మినహా మిగతా డబ్బంతా జేబులోవేసుకున్నాడు.

"అయిదు రూపాయ లడిగావుగా, తీసుకో," నిర్లక్ష్యంగా రామ్మూర్తి నోటుని అతనివైపు తోశాడు. అతను ఆతృతగా తీసుకొని జేబులో వేసుకున్నాడు.

నేను కాఫీ తాగబోయి కింద పెట్టేను. అందులో ఏదో జీవం ఉంది. రామ్మూర్తి చూడకుండా అది తీసివేయాలనిప్రయత్నించాను. కాని అతను చూడనే చూశాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ." అని కప్పు నాచేతిలోంచి లాక్కున్నాడు. ఇంతలో అతని కళ్ళు చింతనిప్పులయ్యాయి. చర్రున కుర్చీ వెనక్కితోసి నిలబడ్డాడు.

"స్కౌండ్రల్, కళ్ళు పోయాయా? లేకపోతే నెత్తిమీద కొచ్చాయా? కొవ్వెక్కిందా? ఇడియట్. ఇలాగేనా పెద్దమనుషులకు కాఫీ ఇచ్చేది. ఫో, బయటికి."

మేఘంలా గర్జిస్తూ కాఫీ కప్పు అతనిమీదికి విసిరికొట్టాడు. ఈ ఆకస్మిక పరిణామానికి నేను స్తంభీభూతుడనైనాను. అంతకోపంతో రామ్మూర్తిని ఎప్పుడూ చూడలేదు. ఆ కోటయ్య అనేవ్యక్తివైపు జాలిగా చూశాను. ముఖంమీద కాఫీపడ్డది. షర్టు కాలరూ, కాలరు క్రిందభాగమూ, జేబూ తడిసిపోయాయి. అతను పల్లెత్తు మాట అనకుండా అక్కడనుండి బయటికి వెళ్ళాడు. రామ్మూర్తి తొందరపాటు నాకు చిన్నతనం కలిగించింది.

"అలా తొందరపడ్డావేం రామ్మూర్తీ?" అతని ప్రవర్తనకి అభ్యంతరం తెలియచేస్తున్నట్టు అన్నాను.

"పొగరుపోతు, ఈ మధ్యే నాదగ్గరికి ట్రాన్స్ఫరై వచ్చాడు. వాడిసంగతి నీకు తెలియం దేముంది?"

"అతను?" సందిగ్ధంగా అన్నాను.

"కోటేశ్వరరావు, పాల రంగయ్య కొడుకు."

నిర్విణ్ణుడి నయాను.

"పాపం వాళ్ళనాన్న వీడిని ఆఫీసర్ చేయాలని చెమటోడ్చి సంపాదించి చదువు చెప్పించాలని చూశాడు. వీడదంతా గవ్వల్లా ఖర్చుపెట్టి ఇలా బ్రతుకుతున్నాడన్నమాట."

"ఎవరికర్మాని కెవరు కర్తలు. అలా బయటికివెళ్ళి కాఫీ త్రాగివద్దాంలే."

పాడుకోపాన్ని రామ్మూర్తి ప్రదర్శించటం నాకు కష్టం కలిగించింది. ఏమీ అనలేక అతని వెంట బయటికి వచ్చాను. బటయటికి రాగానే కనిపించిన దృశ్యం నా మనసుని వికలం చేసింది.

కోటేశ్వరరావు ముంగాళ్ళమీద కూర్చుని, తడిసిపోయిన అయిదు రూపాయల నోటుని ఎండలో పెట్టి, అది ఎగిరిపోకుండా చిన్నరాళ్ళు పెడుతున్నాడు. అతని ప్రక్కనే ఏడెనిమిదేళ్ళ పిల్లవాడున్నాడు. వాడితల నిమురుతూ కోటేశ్వర్రా వన్నాడు "చిన్నా! ఈ డబ్బు తీసికెళ్ళి పంతులు గారి కియ్యి. బాగా చదువుకో అయ్యా. కలెక్టరు గావాలి." కుర్రాడు బుద్ధిగా తలూపాడు.

ఇంతలో గాలి రంయిన వీచి నోటు ఎగిరిపోయింది. కుర్రవాడు దానివెంట పరిగెత్తాడు. కోటేశ్వరరావూ పరిగెత్తాడు.

(1967)

— o —